# వచ్చినంతకలగంటే...?



భావరాజు వేంకటకృష్ణరావుగారు

నేను తోటమాలీగా వుంటున్నాను. నెలకు ఎనిమిది రూపాయిలు జీత మిస్తారు. నేనూ, నా కుమార్తె, నా భార్యా, చిన్ని మను మడు ఆతోటలో ఒక గుడిసెలో కాపుర మున్నాము. తోటకు నీళ్లు మళ్లించడము, పూవులు పూయించడం, కూరగాయలు కాపించడం, పండ్ల చెట్లు జాగ్రతతో దోహాదం చేసి పండించడం, ఏరోజు కారోజు ఆపూవులు ఆకాయలు పండ్లు తీసుకొని వెళ్లి మా యజమాని కివ్వడం, తోట జాగ్రత్తగా కాపలా కాయడం-యివి నా పనులు.

మా యజమానికి నలభైయైదేండ్లు దాటి వుంటాయి. ఆయన కొక కుమారు డున్నాడు. ఆయనకీ వుంటాయి యిరవైయేండ్లు. మంచి చామనచాయవంటివాడు. నూనూగుమీసము. నూత్న యౌవనము. తీరైన దేహసౌష్ఠవము. చిన్నవైనా అందాలు ఒలికే కండ్లుగల ఆయన్ని చూస్తే, మరోమాటు చూడాలని ఎవరికైనా పుట్టుతుంది బుద్ధి. ఇదివఱదాకా ఆయన స్కూల్లో చదువుకుంటూవుండేవాడు. ఇప్పుడు చదువు పూర్తియైంది, యింటికి వచ్చాడు. చిన్నప్పటినుంచీ ఆయన్ని నేను యెత్తుకొని మోసి, తోటంతా తిప్పి, కావలసిన పువ్వులు, కాయలు, పండ్లు కోసియిచ్చి పెంచిన కారణంచేత నాకు ఆయనంటే ఏదో ఒకవిధమైన ప్రేమ. ఆయన యిపుడు తోటలోనికి షికారు వస్తే ఎంతపని వున్నా ఆయనవెంటే ఏవో వూసుపోని కబుర్లు చెబుతూ తిరుగుతూ వుంటాను. నేనన్నా ఆయనకికూడా చాల ఆదరం, ప్రేమాను.

ఇలా కొన్నాళ్లయింది. నా కూతురికి పెండ్లివారు వచ్చారు. పెండ్లికొడుకు కూడా పిల్లచూపులకు వచ్చాడు. పిల్లవాడు బాగున్నాడు. పాతికేండ్లుంటాయి. మా అల్లుని తండ్రికి అయిదుగురు కుమార్తెలు, అయిదుగురు కుమాళ్లు. మా అల్లుడు నాలుగోవాడు. మా వియ్యంకునికి ఆట్టే ఆస్తిపాస్తి యేమీలేదు. ఏమాత్రమో తక్కువగా రెండెకరాల దొడ్డి ఒకటి ఉన్నది. ఇల్లొకటి వున్నది. ఆ దొడ్డిలో కూరానారా పండించుకుంటూ కూలినాలీ చేసుకుంటూ మావియ్యంకుడు సంసారం గడు


పుకుంటున్నాడు. మా అమ్మాయి నిచ్చి ఆ కుర్రవానికి పెండ్లి చేస్తే బాగుంటుందని చూడగానే సంకల్పం కలిగింది. కాని ఒక సందేహం కూడా వెంటనే పీడించింది. సందేహం కాదనుకుంటాను, బాధ కలిగింది......ఒక్కటే ఒక్క పిల్ల బ్రతికివున్నది. ఎంతమందో కలిగి పోయారు. పెద్దదిచూస్తే పెండ్లిఅయి, కాపురానికి వెళ్లి, అన్నీ సలక్షణంగా జరిగి, తటాలున కళ్లముందరే ఎగిరిపోయింది. ఇప్పటి కింకా ఆ దుఃఖము తీరనేలేదు! దాని కడుపున కాసిన ఒక కసువున్నాడు. వాణ్ని చూస్తూ ఈ ముసలితనములో మా దుఃఖమును ఉపశమింపజేసుకుంటున్నాము నేనూ, నా భార్యాను. ఇక యీ చిన్న పిల్లనుకూడా పెండ్లి చేసి అత్తింటికి పంపితే తరువాత విడిచి ఉండడం ఎలాగని తలచుకుంటే పట్టరాని దుఃఖం వచ్చింది. ఆ రోజల్లా నేను నా భార్యా ఆలోచించుకున్నాము. ఎంతయినా కడుపుతీపునకు అంతంలేదు. చివరకు సాహసించి మా దెంత బీదసంసారమైనా అల్లుడు ఇల్లరికం ఉంటే పిల్లనిచ్చి పెండ్లి చేస్తానన్నాను. ఆమాటనేటప్పటికి మా వియ్యంకుడు సంతోషంచేత ఎగిరి గంతువేసినాడు. ఆతనికి దారిద్ర్య భారంచేత ఒకకొడుకు సంసారభారం తగ్గినామేలే అనుకున్నాడు కాబోలు. తన కొడుక్కి పెండ్లి అయితే చాలునని ఉన్నవాడు కాబట్టి ఇల్లరికం అంటే వెంటనే అంగీకరించాడు. ఎలాగో పెండ్లి అయిందనిపించాము. పెండ్లి అయినప్పటినుంచీన్నీ అల్లుడు మా యింట్లోనే వుండిపోయినాడు. ఇక మరివొకమాటయినా పుట్టినింటికి వెళ్లలేదు.

మరికొన్నాళ్లయింది. మా అమ్మాయి చూపులకు నల్లనైనా అందంగానే కనుపిస్తుంది. సొగసైన దాని కండ్లు, నల్లనై నిగనిగలాడే దాని తలకట్టు, నుదుటిపై సహజంగా నాట్యం చేసే ముంగురులు, తీరైన ముఖమూ, యివన్నీ నల్లతనాన్ని మరిపించి సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తున్నాయి. అయినా నా పిల్లను నేను ఆట్టే పొగడుకోవడం మంచిది కాదు. నా భార్య సొగసుకత్తె కావడంచేత తల్లిపోలికలున్న నా పిల్లకూడ అందకత్తె 'అని చెప్పవలసినదే. అయినా మా కులంలో అందమైనవాండ్లుండరో? ఇపుడు యౌవనం ఆవిర్భవించింది. సహజంగా సొగసైన దేహానికి యౌవనప్రాదుర్భావము మరింత వన్నె తెచ్చింది. మేము బీదవాళ్లమైనప్పటికి నా కూతురికి విలువైనకోకలు, రవికెలు, నగలు, నాణాలు లేకపోయినప్పటికీ అది వున్నవాటిని సింగారించుకుని ఎదుట నిలబడితే గుటక వేయక నిలబడి దాని అందం తనివితీర చూడని మగవాడుండడు. మా పిల్లను చూస్తే తెలిసినవాడెవడైనా యీమె తోటమాలీకూతురు అని అనుకోవాలి కాని యితరులు ఎవరూ అనుకోరు.

తోటలో నేను యాతాం తోడుతూంటే నా కూతురు ఒకనాడు మొక్కలకు నీళ్లుమళ్లించుతూ వున్నది. సాయంకాల మవుతుం దప్పటికె; కాని సూర్యాస్తమయం కాలేదు. ఆకాశంమీద అపుడే శుక్లచంద్రుడు సగము రూపముతో తనకు రాబోయే మహదైశ్వర్యమును తలుచుకుంటూ కనిపించాడు. ఎప్పటిలాగే మా

చిన్న బాబుగారు తోటలోనికి షికారు వచ్చారు. తోటంతా తిరిగి పొద్దుట విడిచిన గులాబి పువ్వులను, మరికొన్ని వాసనపూవు గుత్తులను చేర్చి చెండుగా కట్టి, నడుమ నడుమ వాసన చూస్తూ, నా కూతురు నీళ్లుమళ్లిస్తున్న తావుకు వచ్చి కొంచెందూరాన నిలబడ్డారు. పువ్వుల గుత్తి వాసనచూడడంలో ఆయన నా కుమార్తె అందంఅంతా ఆఘ్రాణిస్తుండిపోయారు. ఆలాగే ఆమె సౌందర్యరసం అంతా ముగ్ధుడై క్రోలడం ఆరంభించాడాయన. సౌందర్యతృష్ణకు పిపాసయేగాని దాహముతీరుట లేదుగాబోలు. మా అమ్మాయికూడా చిన్న బాబుగారివైపు అప్పుడపుడు చూసితనలో తాను ముసిముసి నగవులు నవ్వుకుంటూ ఉన్నది. ఆయన వెన్నెల్లో ప్రతిమలాగ చైతన్యరహితమై ఱెప్పయినా వాల్చకుండా ఆమెవంకే చూస్తూ ఉండిపోయాడు. ఒకరినొకరు చూసుకుంటూ వారిద్దరూ ఆ స్థితిలో ఎంతసేపటినుంచి ఉన్నారోగాని, నేను ఏతాంపైకెత్తి నడుము సాచుకొని ఒకసారి తలపైకెత్తి అటువైపు చూచునప్పటికి ఒక్క త్రుటిలో అంతా వారివైఖరిఅంతా అర్థమైపోయింది. రెండవక్షణంలో నాకేమి తోచిందో నే నిపుడు చెప్పలేను. చిన్న బాబుగారివంక ఒకసారి చూచాను. చూచినవెంటనే చూపు మరలించి ఏతాం దింపకుండా పిల్లవైపు మరియొకసారి చూచాను. అంతలో నా తలలో ఏమేమి యూహలు పొడమెనో కాని, అప్రయత్నంగా 'పిల్లా! మీయమ్మ పిలుస్తున్నట్టుంది! ఎందులకో? ఒక్కసారి వెళ్లి చూచిరా!' అని అన్న మాటలు మాత్రం నోటినుండి వెలువడ్డాయి. కనురెప్ప పాటులో మళ్లీ మారుమాట చెప్పకుండా నాకూతురు చేస్తున్నపనిని యెలావున్న దానిని ఆలాగే విడిచిపెట్టి మెఱుపులా లేచి మాయమైంది. నిజంగా నా భార్య దాన్ని పిలవలేదు. కాని నా హృదయంలో వున్న ఊహాలు ఆమె ఏలాగున గ్రహించిందో!... ... ఆడవాళ్లు మగవాళ్ల మనసు ఇట్టే పసికడతారు కాబోలు!

మా బాబుగారికి నా మాటలు చెవిని పడ్డాయో లేదో గాని, ఒకటిరెండు క్షణాల వఱకు ఆయన అక్కడనే నిలబడిపోయారు. కొంతసేపటికి నన్ను చూచి నన్ను మామూలు



"ఏతాం పైకెత్తి.........అల్పమైపోయింది"

ప్రకారం పలకరించకుండా గబగబ అక్కడ నుంచి నడిచి వెళ్లిపోయారు.

*    *    *    *

మరికొన్నాళ్లయింది. వేసవిసాయంకాలపు ఎండ ఆరోజున పెందరాళే తగ్గిపోయింది. ఆకస్మికంగా ఎక్కడనుండో పెద్దమేఘం వకటి వచ్చి ఆకాశమంతా క్రమ్మేసింది. క్షణంలో అంతా చీకటైపోయింది. ఒక్కమారు భయంకరమైన పెనుగాలి కూడా వీచింది. పిమ్మట చిరువాన చిటపటమని కురిసింది. మళ్లీ వాన వెలిసేటప్పటికి, ఎక్కడిమబ్బు అక్కడికి చెదరిపోయింది. సూర్యభగవాను డస్తమిస్తున్నాడు. వేసవికాలంలో చిరివాన కురిసిన వెనుక దక్షిణానిలం చాలామనోహరంగా వుంటుంది. ఆ పిల్లవాయువులు పుష్పములలోని పరిమళమును అపహరించుకొని తమతెఱలపై కొనిపోతూ వున్నట్టున్నవి. వర్షం వెలిసిన తరువాత ఏలాగున వున్నదో చూద్దామని తోటలోనికి వెళ్లాను.

ఒకచోట సంపెంగచెట్టు తీగెలు ముండ్లపొదలాగున అల్లుకొని ఒక నికుంజంగా యేర్పడి వున్నాయి. ఆ తావు మా పెద్దబాబుగారికి చాలా ప్రీతికరమైనది. ఆ సంపెంగపూవులు పూచినపుడు చెట్టుదగ్గర కూర్చుండి ఆ పరిమళం ఆఘ్రాణించడం అంటే ఆయనకు మిక్కిలి యిష్టం. అందుచేత ఆయన ఆ నికుంజమునకు సమీపములో ఒక్క గున్నమామిడి క్రింద చిన్న తిన్నెకూడా కట్టించుకున్నాడు. సాయంకాలము ఎపుడైనా వచ్చినపుడాయన ఆతిన్నెపై పరుండి నేను చెప్పే లోకాభిరామాయణం, మంచీచెడ్డా, కబుర్లూ వింటూంటాడు. ఇపుడా సంపెంగచెట్టువైపునుంచి, ఆ తిన్నెవైపునుంచి మంచి సువాసనలు వస్తున్నాయి. సంపెంగ పుష్పించిందని అనుకుని మంచిపువ్వులు రెండు కోసి మా బాబుగారికి తీసుకుని వెళ్లియిద్దామని ఆ పొదవైపు మొగమై రెండడుగులు వేశాను. అంతలో ఏదో చిన్న అలికిడి అయినట్లు నా చెవికి సోకింది. ఈ సమయంలో తోటలోని కెవరు వచ్చివుంటారా అని అనుకుంటూనే పరధ్యానంగా మరిరెండు అడుగులు వేశాను. సంపెంగపూవులు వాసన వెదజల్లడమే గాని, కంటికి కాటుకపెట్టికొని వెదకినా సులభంగా కనబడవు. అందుచేత వాసన ఏవైపునుంచి వస్తున్నది అని ఆలోచించి పొదంతా వెదకడం ఆరంభించాను. తుదకు నాకు ఎడమవైపున ఒక మంచిపువ్వు కనిపించింది. దాన్ని అందుకోబోతే దాని చెంతనే మరి యొకటికూడా కనిపించింది. ఈ తోటంతా పరిమళంతో నింపేస్తున్న పువ్వులీ రెండే యని నేనపుడనుకున్నాను. ఆ రెండుపువ్వులు కోద్దామని మరికొంతప్రయత్నం చేసి, అందకపోతే దిగి మరియొకవైపునకు వచ్చి అందుకోపోయినాను. అపుడు నా కళ్లకొక క్రొత్తవిషయం, ఎన్నడూ తలచనిది, కనుపించింది. నేను ఒక్కసారిగా నిర్విణ్ణుణ్ని అయిపోయినాను. కనురెప్పలు సారించి మరియొకసారి నిశ్శబ్దంగా ఆ

వైపే చూశాను. మా చిన్న బాబుగారి కవుగిటి
లో నాకూతురు పరవశమై అరమోడ్పు కను



దోయితో,తొలగియాడెడి పెదవులతో,......
ఉన్నది. ఆ ఉభయులు తన్మయులై ఆనంద
సముద్రములో తేలియాడుతూన్న ట్టున్నారు.
నేను చూస్తున్నది నిజమా? కలా? అని సం
దేహం కలిగింది. కన్నులు మరియొకసారి
నులుపుకొని అట్టే మళ్లీ చూచాను. నేను
సమీపంలో వున్న సంగతి వారికేమీ తెలిసి
నట్లు తోచదు. నేనిలా చూడడం నాకే ఎందు
చేతనో సిగ్గుచేటనిపించింది. దేహ మంతా
కంపమెత్తింది. కులగౌరవమును, మర్యాదను
కూలద్రోసుకున్న ఆ కాముకులను చూచే
టప్పటికి పట్టరాని కోపము, జాలి
కూడా ఒక్కసారిగా కలిగినవి.

దేహమంతా నాకు ముచ్చెమటలు పోసింది
సంశయమూ, భయమూ కూడా ఒక్కమా
రుగా నా మనస్సున తట్టినవి. అంతట ఏమి చే
యుటకు తోచక, కొమ్మలు నరకబడిన చెట్టు
వలె స్తబ్ధుడనై పోయాను. అపుడేనో అవ్యక్త
మైన స్వర మొకటి-కాదు శబ్ద మొకటి-నా నో
టినుండి అప్రయత్నముగ వెలువడినది. సుఖ సు
ప్తులయియున్న యా రమణీరమణులు దానితో
ఉలికిపడి లేచారు. నలుదిక్కులు బెదరినచూ



పులతో పరికించారు. నే నింకను వారివంకే
చూస్తున్నాను. వారు మాత్రం నావైపు చూడ
నేలేదు. కాని యింతలో నాకొక భయంకర
మైన శబ్దము వినబడింది. పిడుగువలె నా శబ్దము
నా కర్ణరంధ్రములలో ప్రవేశించి హృదయ


మును చీల్చి దహించివేసింది. ఇంటి నడికప్పు విరిగి కూలినట్లు తోచింది. నాకు కన్నులు మరల మిరుమిట్లు గొలిపియుండెను. ఉత్తర క్షణములో మా చినబాబుగారు తల రెండు ప్రక్కలై, ఆయన నెత్తుటివరదలో పొరలాడుతూ వుండుట కనిపించింది. ఆచెంతనే మూర్ఛపోయిన నా కూతురుకూడా రక్తంలో పొరలాడుతున్నది. ఆ స్థితి చూచేటప్పటికి నా కన్నులు తిరిగిపోయినవి. తల దిమ్మెక్కిపోయింది. నేను నిలబడిన స్థలందగ్గరనుంచి ఒక అంగుళమైనా కదలలేక పోయాను. చేతులు, కాళ్లు, దేహము, అంతా కొయ్యబారి పోయినవి. మనసులోనిమాట మనసులో మణిగిపోయింది. నాలుకతడి యారిపోయింది.

... ... ...

నెత్తుటిలో పొరలాడుచున్న యా యువతీ యువకులను మరియొకసారి చూచాను. చూచి కనులు పైకెత్తినాను. వారి కవతల యమకింకరునివలె భయంకరుడై దండపాణియై వికృత హాసముతో శవమును పరీక్షిస్తువున్న నా అల్లుడు కనిపించాడు. ఆతని వికృతహాసము నా కదివఱకు కలిగిన భయమును ద్విగుణము చేసింది. ఎట్లో ఆతనివంక మొగమై, 'ఎంత పని చేసితివిరా! నాయనా!' అని మాత్రము అనగలిగాను. నా మాట లాలకించి ఆతడు కర్ర విసరివైచి పరుగెత్తినాడు. నేనేమయితినో-నా కేజ్ఞాపకము లేదు ఇపుడు.

౨

కొన్ని నెలలు గడచిపోయాయి. ఈలోపుగా నేనున్నూ నా అల్లుడున్నూ కలిసి మా చిన్నబాబుగారిని హత్యచేసినట్లు పోలీసువారు మాపై అభియోగము దెచ్చినారు. ఈ కేసు రావడంతో నాకొంప నట్టేట కూలిపోయింది. పరమేశ్వరుడు తప్ప నేను దోషినో నిర్దోషినో తెలిసినవారెవ్వరూ యీ భూమిపై లేరు. తెలిసినమానవుడు నా తోపాటు ముద్దాయిగా నున్నాడు. నేనేపాపపుణ్యములు ఎఱుగనని న్యాయస్థానంలో ఘంటాపథంగా చెప్పాను. నేరస్థుడైనప్పటికి నేరంచేయలేదనే వాదంతో బయలుదేరే న్యాయాధికారులు ముద్దాయీలు చెప్పుకొనేమాటలు నిజమైనా విశ్వసించరు. అందుచేత ఇపుడు నానిర్దోషిత్వవాదంకూడా ఎవరూనమ్మలేదు. న్యాయాధి



కారి కేసుపూర్తిగావిచారించి ముగించారన్నారు. నేనూ నాఅల్లుడూకలిసి మాచినబాబుగారిని చంపినట్లు అభియోగము ఋజువైనదనిన్నీ, యింత ఘోరమైన నరహత్య చేసినవారికి దయాదాక్షిణ్యాలు చూపించనక్కరలేదనిన్నీ న్యాయాధికారి యెంచి మాకు ఉరిశిక్ష విధించాడు. 'నీవు నేరం చేశావు. నీకు వురిశిక్ష వేయబడినది' అన్నమాటలు వినబడినపుడు నాకు ఎక్కడాలేని భయం వేశింది, నేను నేరం చేయనప్పటికీ నాకీఘోరశిక్ష యెందుకు విధించారో తెలియకపోవడంచేత విపరీతమైన భయం వేశింది. ఉరితీయడమంటే-ఉరిమాట తలుచుకునేటప్పటికి దేహమంతా ఝంఝూమారుతములో అల్లాడిన వృక్షమువలెనే ఊగిపోయింది. ఒక్కఅడుగైనా ముందుకు పెట్టలేకపోయాను. 'బాబయ్యా! నేను ఏపాపం ఎరుగను బాబయ్యా! అన్యాయం అన్యాయం......' అని గట్టిగా న్యాయాధికారివైపు ముఖం పెట్టి అరచాను. కాని 'ఉశ్శ్'మని శబ్దము మాత్రం వినబడినది. నాకు కన్నులు ఉండి ప్రయోజనం లేకపోయినస్థితిలో నున్నవపుడు. త్రోవ తెన్నులు కనబడలేదు. నానోటనుండి మాటలు యింకా పూర్తిగా రానేలేదు. చెప్పదలచుకున్నదంతా చెప్పనేలేదు. కాని పోలీసు జవాను మాత్రం మెడమీద చేయివైచి గట్టిగా నొక్కి, 'పలం-పదరా!' అని గర్జించాడు. అసలేజీవచ్ఛవమైయున్న నాకు ఆ గర్జనతో ఉన్న చైతన్యం కూడా హరించిపోయింది.


నేను కేసులో ముద్దాయిగా నున్నపుడు మా పెదబాబుగారు మాత్రం నన్ను విడిచిపెట్టలేదు. ఆయనతో జరిగినసంగతి కూడా ఏమీ చెప్పలేదు. కాని చిన్నప్పటినుంచి నా సంగతిసందర్భములు ఎఱిగిన ఆయనకు నేను దోషిని కానని పూర్తిగా నమ్మకం ఉంది. అదీ కాకుండా, చిరకాలం వారి కొలువుచేసి ఉండడంచేత నామీద ఆయన కొకవిధమైన ప్రేమ కూడా వుంది. తన సొంతపైకం ఖర్చుపెట్టి ఆయన నాకు ప్లీడరును కూడా కుదిర్చిపెట్టినాడు. కాని దైవము వేరుగా తలుస్తున్నప్పుడు ఎవ రేమి సహాయం చేసినా ఉపచరించదు. నా కర్మం యిట్లుండగా ఆ ప్లీడరుమాత్రం యేం సాయం చేస్తాడు?

నేను ఇపుడు కారాగారంలో చెరను అనుభవిస్తూ, ఉరిదీసేరోజు ఎపుడు వస్తుందో అని రోజులు లెక్కపెట్టుకుంటున్నాను. ఉరితీయబడేవారి బ్రతుకు పశువుల జన్మకంటె చాలా హేయతరమైనది. ఎటు చూచినను నేనొక్కడనే జీవుణ్ణి అక్కడ. నా ముందు బయలు, ఆ బయలులో నొక పెద్దరావిచెట్టు; ఆ చెట్టుమీద అప్పుడపుడు వాలే రాబందులు- ఇవితప్ప నాకు తోడెవ్వరును ఆ చెఱసాలలో కనబడలేదు.

ఇక నన్ను ఉరితీసేదినము పదిహేనురోజులకు వస్తుంది. ఆరోజు వచ్చేవఱకు ఏదో విధంగా దృష్టిమరల్చుకొని దైవమునే ధ్యానం చేస్తూ కాలంగడిపితే బాగుంటుందని అలాగే

చేశాను. ఇల్లువాకిలి, భార్యాపిల్లలు, వీరి మీదకు దృష్టి మనసు పరుగెత్తకుండా భగవన్నామస్మరణ చేస్తూ, యీరోజులలో చాలా భాగం గడిపేశాను. కాని అపుడపుడుమాత్రం నా యిల్లాలి దుఃఖం, ఆమె దురవస్థ తలచుకొని గంటలకొలది కన్నీరు కారుస్తూ వుండేవాణ్ణి. పెండ్లిఆడినది మొదలు యీ విపత్తువచ్చేవఱకు కష్టంలోనూ, సుఖములోనూ మేమిద్దరము ఒకరినొకరు ఒకక్షణమైనా విడిచివుండడం ఎరుగము. అందుచేత యీ ఎడబాటు—యీఆపదతో వచ్చినఎడబాటు-భరించడానికి మాకిద్దరికి శక్యంగాకపోయింది. నా యేడ్పు విని ఒకనాడు కావలివాడు గట్టిగా యేడువవలదని నోటిమీద రెండుదెబ్బలుకొట్టి, మరల ఏడ్పు వినబడినచో ఇంకా కఠినంగా శిక్షిస్తానని భయపెట్టి వెళ్లినాడు. దెబ్బలబాధ ఓర్చుకోకలిగినా దుఃఖబాధ ఓర్చుకోలేక పోయినాను. దుఃఖంలో వున్నప్పుడు గట్టిగా ఏడువనివ్వని ఏమి పాపిష్టిలోకమురా ఇది అని అనిపించింది.

ఒకసారికాబోలు నా యిల్లాలు నన్ను చూచుటకు వచ్చిందట. చెఱసాల కావలివాళ్లు నన్నుచూచుటకు ఆమెకు అనుజ్ఞ ఇవ్వలేదు. వారందరూ ఆమె యెవరిచేతనో వ్రాయించి తెచ్చుకొన్న అర్జీని పైవారకు చూపించి సెలవు తేవడానికి అయిదురూపాయీలు లంచం కావాలన్నారు. అయిదురూపాయీలు కాదుగదా నా భార్యదగ్గర అపుడు అయిదు చిల్లిగవ్వలైనా లేవు. కటికి దరిద్రం అనుభవిస్తున్నది. ఇంటిలోవున్న సామానులు, ఆవును, గేదెను, అన్నింటిని వరుసగా ఆమె తెగనమ్ముకొని, నేను ఈకేసులో తగులుకొనియున్న ఎనిమిదిమాసములనుండి జీవనం చేసింది. ఈ లోపుగా కూతురుచావు, మనుమని మరణంతో ఆమెకు జబ్బుకూడా చేసింది. కష్టాలన్నీ పరంపరగా రావడంచేత ఆమెకు మతి చలించింది. కాని ఆచలించిన మతిలో కూడా నన్ను ఒకసారి చూడాలని అనుకొని అర్జీ వ్రాయించుకొని వచ్చింది. కాని అయిదు రూపాయీలు ఎట్లా వస్తాయి? పొట్టకే పిడికెడు మెతుకులు సంపాదించుకోలేని దుస్థితిలోనున్న నా భార్య అయిదురూపాయిలు ఎక్కడనుండి తేగలదు? దీనితో నన్ను కడసారి చూడాలని ఉన్న ఆశ కూడా తీరక మరింత బాధాకరమై పోయింది. ఆమె కావలివాళ్లను ఎంతో వేడుకొన్నది. బ్రతిమాలుకొన్నది. కన్నీరుకాలవలై పాగేటట్టుగా ఏడ్చి తన దుర్భరమైన సంతాపభరమంతా వెల్లడించింది. నీటిబొట్లు పడగాపడగా రాయిఅయినా కరిగిపోతుంది గాని కఠినమైన మానవాధముల మనసు కరగబోదు. మా కావలివాళ్ల మనసు కరగలేదు. అందుకు వాళ్లనవలసిన పని యేమున్నది? నాలాగున ఉరిశిక్ష విధింపబడ్డవాళ్లనూ, వాళ్ల పెండ్లాముబిడ్డలను, వారి యేడ్పులను వాళ్లిదివరకు ఎన్నిసారులు చూచియుండలేదు? వినియుండలేదు? ఇట్టికథ వారికి అలవాటయిపోయింది. నా భార్యగోడు వారికి క్రొత్తదాఏమి? అవీ కాకుండా, కఠినులు, దుర్మార్గులు, మూర్ఖులు, పాపులు అయిన నరాధముల సహవాసములో నిరంతర




మూ మెలగుతూవుం డే హృదయమన్నది చంపుకుని తిన్నవా ళ్లకు దయదాక్షిణ్యా ములు నశించిపోవ డంలో ఆశ్చర్య మే మున్నది? దయ, అంతఃకరణ, అన్న మాటలు భావాలు వారు మరిచిపోయి వుంటారు. దిక్కు మాలియున్న యీ ఆపత్కాలంలో నా భార్య దగ్గర ఐదు రూపాయలైనా లేకపోవడంచేత ఆమెదుఃఖము, విలాపము, దుస్థితి, అశ్రువులు లెక్కకు రాక పోయినవి. ఇట్లామె కావలివారికి కరుణ ఎప్పటికైనా వస్తుందేమో యని ఎన్ని దినముల వఱకో వస్తూపోతూ ఉండేది. చివరకు ఒక నాడు ఆమె దుఃఖము పట్టజాలక గోలపెట్టి ఏడు స్తూ రాత్రి ప్రొద్దుపోయేవఱకూ చెఱసాల ప్రక్కనున్న రోడ్డుపై పొరలాడుతూ ఉండి పోయింది. ఆవేళ చెఱసాలాధికారి తెల్లవాడు మోటారుకారులో నెక్కి యింటికి అతివేగం గా వస్తున్నాడు. దీపముల కాంతీ, మోటారు కారు వికారపుకూతా, ఒడలెరుగని దుఃఖంచే వివశమై బాటకడ్డంగా పడియున్న నా భార్యకు గోచరంకాలేదు వినబడనూలేదు. దొర మో టారును మెల్లగా నడుపుతూ, కొమ్ముబూరను గట్టిగా నొక్కుతూ, గట్టిగా చాలాసార్లు అరి పించాడు. కాని నా భార్య కొంచమైనా చలించ లేదు. పేడెత్తిన కోపంతో ఆపాటున అతడు తటాలున మోటారును ఆపి, దిగి, శవాకారంగా పడియున్న నా భార్యను సమీపించినాడు. ఆమె ఎవరో, ఎందుల కట్లా పడియున్నదో, తెలియకపోవడంచేత, దొర ఆమెను తన చేతి బెత్తంతో యిటునటూ దొర్లించడానికి ప్రయ త్నించినాడు. కాని ఆమె జీవించి యున్నట్లు తప్ప స్మృతి కలిగియున్నట్లు కనుపించ లేదు. తన దగ్గరనే దీపం పట్టుకొనియున్న నౌకరుపంకె చూచి ఆమెను చేతులమీాద తీసుకొని వచ్చి బండిలో వేయమన్నాడు. బంగాళాకు ఆమెను తీసుకొని వెళ్లినతరువాత పాప మాదొర నా భార్యకు స్మృతి కలిగించడానికి ఎన్నో ఉప చారాలు చేయించి, ఆకలిచే సొమ్మసిలి యు న్నందువలన గంజి కాపించి పోయించినాడు. తెలివివచ్చిన వెనుక ఆమె గోడునంతా సావధా నంగా విన్నాడు. ఆమెచెప్పిన దుఃఖభాజనమైన కథవినేటప్పటికి కన్నులవెంబడి నీరుతిరిగింది. దీని

నంతా చూస్తూ దొరకు సాయంచేస్తున్న దొరసానికికూడా పట్టరాని దుఃఖము వచ్చి వెక్కి వెక్కి ఏడువసాగింది. చిట్టచివరకు దొర గద్గద స్వరంతో నాభార్యను జూచి, "సరేలెమ్మ— నీదురదృష్టమునకు మేముకూడా చాలా వగస్తున్నాము. కడచినదాని కెవరును ఏమియు నిపుడు చేయజాలరు. లెమ్మ. ఆ మెత్తపై పండుకొమ్మ. తెల్లవారినతరువాత నీ భర్తను నీకు చూపిస్తాను. నీ యిష్టమువచ్చినంత సేపు ఆతనితో మాటలాడి దుఃఖోపశమనం చేసుకొనుటకు అవకాశ మిస్తాను. నీ దుఃఖం చూస్తే నాకే కడుపు తరుగుకొనిపోతున్నది. ఈరాత్రి యిచ్చటనే యుండుము. ఎల్లుండి సూర్యోదయమునకాబోలు నీభర్త యీలోకమును విడిచి పెట్టవలసియుంది. దుఃఖింపకుము" అని యోదార్చినాడు.

* * * *

దొర తెల్లవారకమునుపే లేచి నౌకరిని పిలిచి నా భార్య మేల్కాంచినదేమో చూచి రమ్మని పంపించాడు. వాడు కొంత సేపటికి తిరిగివచ్చి, 'స్వామీ! ఆమె ఎంతపిలిచినా పలకడంలేదు. ఒళ్లు తెలియకుండా వికారంగా నవ్వుతూ, కనురెప్పలు వాల్చకుండా చూస్తూ పడియున్నది. చూడగా చూడగా నాకు భయంకూడా వేసింది. తమరు ఒకసారి అక్కడకు దయచేయండి' అని అన్నాడు. ఆ మాటలాడుతూ వున్నప్పుడు వాడి మొగము మీద కత్తివేటునకు నెత్తురుచుక్క లేదు. మారుమాటాడకుండా దొర, దొరసాని వాని వెంట నడచివెళ్లినారు. పోయి చూచేటప్పటికి అంతయు సమాప్తమయియుంది. పాపము!



భరించలేని దుఃఖభారముచేత రాత్రి ఎపుడో నా భార్య అట్లే కొయ్యబారిపోయింది. రాత్రి అంతా ఆదురదృష్టవంతురాలు ఒకవంక దుఃఖ బాధ,మరియొకవంక మరణ వేదన ఎంతగా అనుభవించి ప్రాణాలు విడిచిందో! ఆమెను తలుచుకుంటే ఇపుడు నాలోని రక్తం గడ్డకట్టుకొని పోతున్నది. నాకు రానున్న దుర్మరణం గురించి విచారించి,భయపడి, పాపమాయిల్లాలు వికృత హాసంతో ప్రాణములు విడిచిపెట్టింది కాబోలు!

ఆమెసంగతి తెలుపుటకు వెదుకుకుంటూ దొర నాదగ్గరకు వచ్చాడు. దొర నా దగ్గర రావడం అందరికీ లాగే నాకూ ఆశ్చర్యం,

భయం కలిగించినది. సంగతిఅంతా విని యింకా మొండిగానైనా జీవించవలసిందేనా హతవిధీ అని అనుకుని పెద్దనిట్టూర్పు విడిచాను. కండ్లవెంట ఎందుచేతనో కాని నీరు రాలేదు. దుఃఖప్రవాహము గడ్డకట్టుకొని పోయింది కాబోలు. కాని ఆమాటలన్నీ విన్నతరువాత నిలుచున్న మనిషిని అమాంతంగా కూలిపోయినాను. దొర నన్ను విడిచి వెళ్లిపోయినాడు. వెళ్లుతున్నపుడు, 'రేపుదయం తెల్లవారక మునుపు నిన్నురితీస్తారు; సిద్ధముగా ఉండుము. ధైర్యముతో ఉండుము. నీవుకోరేది- నేనుచేయగలది- యేమైన ఉపకారమున్నచో చెప్పుము, చేస్తాను. మనసును కలతపెట్టు కొనకుము. ఈ లోకములో పొందలేనిన్యాయం పరలోకంలో దేవునిముంగిట పొందగలవులే'అనియింకేవేవో అన్నమాటలు నా చెవిసోకిన ట్లయింది.

*    *    *    *

నేను లేచి చూచేప్పటికి నాచెంతను మంటిమూకుటిలో యీగలు ముసురుతున్న అన్నము, పులుసు ఉన్నాయి. కనులెత్తి చూచినపుడు పైన దీపపుకాంతి మినుకు మినుకుమని కానవచ్చింది.

బయిటంతా గాఢాంధకారం వ్యాపించియున్నది.అపుడు నేనింతసేపూ మూర్ఛలో మునిగివున్నానా అని ఆశ్చర్యపడ్డాను. మళ్లీ మెలకువ ఎందుకు వచ్చిందా, ఆ మూర్ఛ పెద్దనిద్ర అయితే చాలా బాగుండేదే అని అనుకున్నాను. ఎప్పుడైనా చచ్చేదే కదా! ఒక పూట ముందు సులువుగా ప్రాణాలు వదిలివేస్తే బాగుండేదే అని విచారించాను. అపుడు నా భార్యయొక్క సంగతి జ్ఞాపకం వచ్చింది. ఆమె చాలా అదృష్టవంతురాలనిపించింది.అంతలో లోపలి కావలివాళ్లు పన్రెండుగంటలు కొట్టుతున్నారు. గంటలు ఒకటితరువాతఒకటి లెక్కపెట్టినాను. చావు సమీపిస్తున్నదని తోచింది. ఇక ఆరుగంటలుమాత్రమే నేనీభూమిమీద యీపాడుజీవితం గడపడంకదా అని తోచింది. ఒకవింత చలి ఆపాదమస్తకమూ నన్ను కంపింపచేసింది. వళ్లంతా ముడుచుకొనిపోయింది.కాని ఎందులకో విపరీతపు నవ్వు వచ్చింది. నేను గట్టిగా నవ్వనారంభించాను. నవ్వు ఆపుకుందామని ప్రయత్నంకూడా చేయలేక పోయినాను. నా కెందులకు నవ్వు వచ్చిందో, నేను ఎందులకు నవ్వుతున్నానో నాకే తెలియలేదు. నవ్వి నవ్వి చివరకు వెక్కి వెక్కి ఏడ్చినాను. ఇంక ఏడవలేకపోయినాను. నేను ఏడవలేక ఆలాగే సొమ్మసిల్లి పోయా ననుకుంటాను. కండ్లు తుడుచుకొని లేచి, ఒళ్లు సారించుకొని, నా గది యినుప కమ్ములు పట్టుకుని నిలబడ్డాను. కావలివాళ్లు మళ్లీ గంటలు కొట్టుతున్నారు. ఒకటి- రెండు- మూడు-నాలుగు-నాలుగుగంట లైంది, చంద్రాస్తమయంతో నా జీవములు కూడా అస్తమిస్తా యని తోచింది. నాకు నా అంతిమక్షణమునకు నడుమ ఇంకెన్నో లెఖపెట్టదగినన్ని నిముషాలుమాత్రమే ఉన్నాయి. ఇంక డాక్టరు, మేజస్ట్రీటు, దొర - అంతా కాగడాలు వేసుకు వస్తారు. వీరే కాబోలు నా పాలిటి యమదూతలు, భగవంతుడా!

*    *    *    *

ఇపుడు నాకు మృత్యువంటె యెందులకో అపరిమితమైన భయం పట్టుకుంది. మనసు పాదరసంలాగ పట్టుకోవడానికి వీలు లేకుండా నాలుగుదిక్కులా పరుగెత్తుతూ ఉన్నది. ఏదో భరించలేనిభారం ఒకటి మనసులో క్షణక్షణానికి ద్విగుణమైపోతూ, ఊపిరితీయడమే దుస్సాధ్యం చేస్తున్నది. నా చేతులు, కాళ్లు, అవయవములు, బుద్ధి-అన్నీ కూడా తిమ్మిరెక్కిపోయిన ట్లున్నాయి. 'అబ్బా, ఉరితీయబడజాలను. ఓహోహో! ఉరి......ఉరి......ఉరిశిక్ష నాకే?............ నే నేం మహాపాపం చేశానోకదా!' అని అనుకుని కంపించి పోయినాను.

'ఏ వీరాగ్రేసరుడనో అయివుంటే, యుద్ధరంగంలో, చావువస్తుందని ఎఱుగకుండా, సాహసంతో ప్రాణాలు వదిలివేయ గలిగియుందును గదా! ఎంత భయంకరమైనా, ఆ చావు స్వయంగా కోరి తెచ్చుకొన్నది; చాలా గౌరవకరమైనది. చచ్చినా వీరస్వర్గం వస్తుం దంటారు తెలిసినవాళ్లు. ఈ చావేమిరా భగవంతుడా! కోరనిచావు! తప్పనిచావు వచ్చిందే! ఈ చావువలన ఎంతటి అగౌరవము! ఎంతటి అమర్యాద!' అని అనిపించింది.

* * * *

మరికొంతసేపటికి 'పోనీ, మా చిన్న బాబుగారి లాగున, సౌఖ్యసముద్రంలో, శ్రీమహావిష్ణువు అనంతశయనం మీాద ఉన్నట్లు, ప్రియురాలి అనురాగం మీాద తేలియాడుతూ, ఉత్తరక్షణంలో కలుగుతూ వున్న చావును తెలుసుకోకుండా, యౌవన దేవతను ఉపాసిస్తూ మహదానందములో ఉసురులు విడిచివుంటే, అదైనా కొంతమే' లని తోచింది.

* * * *

ఇంకా కొంతసేపటికి 'పోనీ, కొంతకాలం రోగగ్రస్తుడనై మంచంపట్టి, యెట్లో దేహం అంతా చివికిపోయిన తరువాత, శ్లేష్మం కంఠావరోధం కలుగజేసి ఊపిరాడకుండా చేసినపుడు తెలివితప్పిపోయి చచ్చిపోవడమైనా కొంత మేలేకాదా!' అని అనుకున్నాను.

* * * *

మళ్లీ కొంతసేపటికి 'పోనీ, అకస్మాత్తుగా రైలుక్రింద పడిపోయి చచ్చిపోకూడదూ?— కొండచివరనుంచి జారిపడిపోయి తలవని తలంపుగా చనిపోకూడదూ?— ఏ పామయినా కరవకూడదూ?—పోనీ, ఎవరైనా మందని విషమిచ్చి నా కెరుక లేకుండా ప్రాణాలను తీసివేయకూడదూ?—అబ్బా! ఏ చావయినా ఉరిచావుకంటె మేలు'అని అనిపించింది.

* * * *

భగవంతుడా! ఆత్మహత్య చేసుకునే వాళ్లు చావడానికి—బలవంతంగా చావడానికి, ఎలా నిశ్చయించుకుని సిద్ధపడి ప్రాణాలు తీసుకుంటారో కదా!

ఈలాంటి ఊహాలు నామనసులో అపుడు తెంపు లేకుండా పరుగెత్తినవి. చావంటే నాకింత భయం ఎందుకు కలిగిందో!

అయ్యో! ఈ విధముగా దిక్కుమాలిన చావు చావవలసిన దేనా? చావవలసిన దేనా? ......చావలేను! చావలేను!

ఇన్నాళ్లు భూమిపై సుఖంగా కాలం గడిపి యిపుడీవిధంగా దుర్మరణం అనుభవించవలసిన దే కాబోలు! మృత్యువు కనబడకపోయినా, పేరు తలచుకుంటేనే యింతభయంకరంగావుంది. తల్లీ! సావిత్రీ! నీ వెలా ఆ కాలాంతకుణ్ణి చూచి బ్రతక కలిగినావమ్మా! నీకు భయము కలుగ లేదూ? అవును-అది నీచావు కాదుకదా!

* * * *

అబ్బబ్బా! ఏమి యీవిపరీతపు బాధ!... చావు సమీపిస్తున్న దని తెలిసినవాళ్లకు, అందులో ముఖ్యంగా బ్రతకాలని ఉన్న మానవులకు, కలిగేబాధ భరించడానికి శక్యం కాదు. అటువంటి విపరీతపుబాధ, యమబాధ, యీ ప్రపంచములో యింకొకటి ఉండబోదు.

ఈ దిక్కుమాలినచావు, చావు సమీపిస్తున్న దని క్షణముక్షణము జ్ఞాపకంచేస్తూ సమీపిస్తున్న చావు—చావవలసిన దే కాబోలు. ఉరిత్రాడు మెడకు తగిలించి వ్రేలాడతీస్తారు కాబోలు. ఉహుఁహుఁ.........నా కెవ్వ రింక దిక్కు? .........నే నెవ్వరికొరకు బ్రతకాలని ఆశతో ఉన్నాను? నాకెవ్వరు లేరే?......... నే నెవ్వరు? ... ... ... ...

ఆకాశంమీద చంద్రుడు నాకష్టం చూడజాలనివాడువలె అస్తమిస్తున్నాడు. ఇంకొక క్షణంలో వెన్నెల సన్నగిలి చీకటి ఆకాశమంతా వ్యాపిస్తుంది. పుణ్యాత్ములు నిర్భాగ్యుల కష్టాలు చూచి ఓర్వలేక యిలాగే తొలగిపోతూ వుంటారు.

నేను ఇంకా బ్రతకడానికి ఏదైనా ఉపాయం ఉందా? లేదు. ఇం కెక్కడిది!

హృదయం పాషాణం కాకపోయినా యీ దుఃఖకష్టసమయములో పాషాణసన్నిభమయినా కాకున్న దే! కాని చావంటే నే నెందులకు ఇంత భయపడుచున్నాను? ఉరిత్రాడు మెడకు బిగించినపుడు- అపు డెంత బాధపడతానో! ప్రాణాలు పోయేటపుడు పడేబాధ ఎలా వుంటుందో! చివరకు ప్రాణాలు ఎలా పోతవో! ఈ దేహాన్ని బలవంతంగా విడవలేక విడవలేక విడిచిపెట్టిన జీవాలు ఏమవుతాయో! ...... ఈ అంతంలేని ప్రశ్నలకు నాకు జవాబు ఏమీ తోచడంలేదు.

నేను చావ కూడదని నిశ్చయించుకుంటాను. కాని ఆ నిశ్చయం కొనసాగడం ఎలాగ?

ఓ ప్రియురాలా! నీవు చాలా అదృష్టశాలివి సుమా! దుర్భరమైన నా దురవస్థను చూచి ఓర్వలేక సులువుగా తనువు చాలించగలిగినావు. కాని అంతటి మహాభాగ్యం నాకు కలుగదు. నేను చావలేకున్నాను.

అయ్యో! అయిదుగంటలు కొట్టుతున్నారే!.........ఉరిదీసే సమయం దగ్గరకు వస్తున్నది. ఓ దైవమా! ఓ దైవమా!...... దైవ

మంటూ ఒకడున్నాడా? ఉన్నాడో లేదో, సంశయముగా నున్నది......ఉన్నాడనుకొంటాను. లేడు-ఉన్నాడు. ఉండి నా కేమి ఉపకారము? ఏం ప్రయోజనం ?

నేను నిర్దోషిని కానా?

ఏపాపం ఎరుగనివాణ్ని నన్ను కాపాడవా?


నేను నిర్దోషిని అని నీవు ఎరిగి వుండిన్ని నన్నే శిక్షిస్తున్నావు! దోషులను ఎందుకు విడిచిపెట్టుతున్నావు? ఇది ఏమి అన్యాయము?

నేను దోషిని కాను. నే నేపాపము ఎరుగను. నేను దోషిని కాను. ఓ దైవమా! నీవు నాకు లేవు. ఓమనస్సాక్షీ ! నీవే ప్రమాణమవు. దైవానికీ, లోకానికీ నీవే సాక్షివి.

*    *    *    *

నాకు మెళుకువ వచ్చింది. లేచి కనులు విప్పి చూసేటప్పటికి అరుణకాంతులు ఆకాశమంతా నిండుకొనిఉన్నాయి. తొలి దిక్కున చిన్న వెలుగు పైకి వ్యాపిస్తున్నది. నా గుండియ౼పై కూర్చుండి నాచిన్ని కుమారుడు ముద్దు మాటలతో నన్ను లేపుచున్నాడు; కొట్టుచున్నాడు. కన్నులు సారించి మరియొకసారి చూశాను. పూర్ణబ్రహ్మానందము పూనినట్లయింది.

నే నింతవఱకు అనుభవించింది స్వప్నగత వృత్తాంతమేనా !!!



"నేను దోషినికాను......... నీవే సాక్షివి"

---

## సాగరసంగీతము

కొడాలి ఆంజనేయులు గారు

౧

వటకుటజకోటరకులాయపల్లవముల
  పాట చాలించి నిదురించె పావురాయి
కార్తిక తమోనిశీథి (?) భీకరతరంగ
ఘోష శాంతించి మనుమోయి కొంతతడవు!

౨

క్రమలాతుషారపదాంక రేఖావిభూతి
తామ్రపర్ణి తరంగిణి తరలి వచ్చె
ప్రణయసంగీతసరణి నంబరతలమ్ము
తేటవెన్నెల మోసు లెత్తింపు మోయి!